జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 01-07-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 715 పేజీలు: 4 వెల: రూ.7

## మావోయిస్టు మాజీ నేత కేశవరావు కేసుల విచారణకు..

# లైన్ క్లియర్





* శ్రీకాకుళంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు * జీవో 128 విడుదల చేసిన న్యాయశాఖ * లొంగిపోయినా 15 ఏళ్లుగా జైల్లోనే

శ్రీకాకుళం, జూన్ 30 (వార్త): మావోయిస్టు పార్టీ మాజీ అగ్రనేత దున్న కేశవరావు అలియాస్ డి.కేశవరావు అలియాస్ ఆజాద్‌కు సంబంధించిన కేసుల విచారణ నిమిత్తం శ్రీకాకుళంలో ఏడో అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు-కమ్-ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయనపై ఉన్న 16 కేసుల సత్వర విచారణ కోసం ఈ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేస్తూ న్యాయశాఖ కార్యదర్శి గొట్టాపు ప్రతిభా దేవి జీవో నంబర్ 128 ద్వారా ఉత్తర్వులు విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ సివిల్ కోర్టుల చట్టం 1972 లోని సెక్షన్ 10 ప్రకారం, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) అభ్యర్థనను పురస్కరించుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ప్రత్యేక కోర్టుకు నియమితులయ్యే న్యాయాధికారి బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఈ ఉత్తర్వులు అమల్లోకి రానున్నాయి.

### చిన్న వయసులోనే ఉద్యమబాట

శ్రీకాకుళం జిల్లా మందస మండలం బొడ్డులూరు గ్రామానికి చెందిన కేశవరావు, 1990ల కాలంలో చాలా చిన్న వయసులోనే నాటి పీపుల్స్ వార్ గ్రూప్‌లో చేరారు. ఆ తర్వాత కాలంలో సీపీఐ (మావోయిస్టు) ఒరిస్సా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, వంశధార డివిజనల్ కమిటీ సెక్రటరీగా, ఆంధ్రా-ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీలో అగ్రనేతగా ఎదిగారు. 2008 నాటి స్వామి లక్ష్మణానంద సరస్వతి హత్య, నయాగఢ్ ఆయుధాగారంపై దాడి వంటి పలు కీలక కేసుల్లో ఈయన ప్రధాన నిందితుడిగా ఉన్నారు. అప్పట్లో ఈయనపై రూ.10 లక్షల రివార్డు కూడా ఉండేది.

### లొంగిపోయినా వీడని నిర్బంధం..

హింసాత్మక రాజకీయాలు వీడి సాధారణ జీవితం గడపాలని భావించిన కేశవరావు, 2011 మే 18న అప్పటి పలాస ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులతో కలసి నాటి ఏపీ డీజీపీ సమక్షంలో లొంగిపోయారు. అయితే, లొంగిపోయిన పది రోజుల్లోనే ఒడిశా పోలీసులు ఈయనను కస్టడీలోకి తీసుకుని భువనేశ్వర్ ఝర్పాడ హై సెక్యూరిటీ జైలుకు తరలించారు. అప్పటి నుంచి దాదాపు 15 ఏళ్లుగా ఆయన విచారణ ఖైదీగానే ఒడిశా జైలులో మగ్గుతున్నారు.

### జైలులోనే ఆమరణ నిరాహార దీక్ష..

తనపై ఉన్న కేసుల విచారణను వేగవంతం చేయాలని, తనను క్రమంగా కోర్టుల్లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ కేశవరావు ఒడిశా జైలులోనే పలుమార్లు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. 2016లో 21 రోజుల పాటు దీక్ష చేయగా, కేసుల విచారణలో జాప్యాన్ని నిరసిస్తూ అక్టోబర్ 2025లో కూడా జైలులోనే మరోసారి నిరాహార దీక్ష చేపట్టారు.

### కుటుంబ సభ్యుల ఆవేదన..

ప్రభుత్వంపై నమ్మకంతో లొంగిపోతే, ఏళ్ల తరబడి విచారణ పేరిట జైలుకే పరిమితం చేశారని ఆయన తల్లి కాములమ్మ, కుటుంబ సభ్యులు పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కేబినెట్ తీర్మానం చేసినా అమలుకు నోచుకోలేదని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఈ ప్రత్యేక కోర్టు ఏర్పాటు ఉత్తర్వులతో ఆయనపై ఉన్న 16 కేసుల విచారణ ప్రక్రియ వేగవంతం కానుంది.

### లొంగిపోయినా దక్కని స్వేచ్ఛ..

లొంగిపోతే పునరావాసం, సాధారణ జీవితం కల్పిస్తామన్న ప్రభుత్వాల హామీలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయా?" అనే చర్చను మావోయిస్టు మాజీ నేత దున్న కేశవరావు అలియాస్ ఆజాద్ ఉదంతం తెరపైకి తెచ్చింది. 2011లో లొంగిపోయినప్పటికీ, గడిచిన 15 ఏళ్లుగా ఆయన జైలులోనే విచారణ ఖైదీగా మగ్గుతుండటంపై హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆజాద్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు గత ఏడాది జూలైలో కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో ఆయనపై ఉన్న కేసుల విచారణను ఏడాదిలోగా పూర్తి చేయాలని, ఇందుకోసం ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. ఏపీ పోలీసులు సమర్పించిన అఫిడవిట్ ప్రకారం పెండింగ్‌లో ఉన్న 16 కేసుల సత్వర విచారణ కోసమే ప్రభుత్వం తాజాగా శ్రీకాకుళంలో ఈ ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేస్తూ జీవో నంబర్ 128ని జారీ చేసింది.



## అయ్యో.. పాపం

* పిల్లల గొంతు కోసి.. ఆపై ఆత్మహత్యాయత్నం
* రక్తపు మడుగులో ఆ తల్లి
* కొనఊపిరితో ఉన్న తల్లిని ఆసుపత్రికి తరలించిన కుటుంబీకులు
* వెదుళ్లవలసలో గుండెలు పిండేసే విషాదం
* విచారణ చేపడుతున్న పోలీసులు

ఆమదాలవలస, జూన్ 30 (వార్త): ఇద్దరు పిల్లల గొంతుకోసి ఆపై తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆమదాలవలస మండలం వెదుళ్లవలసలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆమదాలవలస మండలం వెదుళ్లవలస గ్రామానికి చెందిన కూర్మాపు రమణ వలస కూలీగా ఉంటూ వరంగల్‌లో పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా అతని భార్య కూర్మాపు వరలక్ష్మి(30) తన అత్త లక్ష్మితో కలిసి గ్రామంలో నివసిస్తోంది. రమణ, వరలక్ష్మి దంపతులకు భవానీ(3), చాందినీ (4 నెలలు) సంతానం. సోమవారం రాత్రి వరలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి లోపల పడుకోగా, అత్త లక్ష్మి ఇంటి బయట వరండాలో పడుకుంది. మంగళవారం ఉదయం నిద్రలేచి ఇంటి తలుపులు తెరిచి లోపలికి వెళ్లిన లక్ష్మి అక్కడి హృదయవిదారక ఘటనను చూసి కన్నీరుమున్నీరైంది. రక్తపు మడుగులో ఉన్న పిల్లలు, కోడలిని భయకంపితురాలై కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు ఇంటికి వచ్చారు. అప్పటికే బిడ్డలిద్దరూ మృతి చెందగా, వరలక్ష్మి మాత్రం కొనప్రాణంతో ఉంది. దీంతో 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న ఆమదాలవలస పోలీసులు గ్రామానికి చేరుకుని ఘటన జరిగిన ఇంటి పరిశీలించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు. వరలక్ష్మి ఇంత ఘాతుకానికి ఒడిగట్టడానికి కారణాలు ఏమై ఉంటాయన్నది చర్చించుకోవడం కనిపించింది. కుటుంబ కలహాలు వల్లే ఆమె ఈ దారుణానికి పాల్పడివుంటుందని గుసగుసలు వినిపించాయి. డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో ఆమదాలవలస ఎస్సై బాలకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.




జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY SIR
ప్రజా సంక్షేమమే ధ్యేయంగా
పాతపట్నం నియోజకవర్గంలో
అనేక అభివృద్ధి కార్యక్రమాలు
చేపడుతూ.. నూతన ఒరవడి
సృష్టిస్తున్న ప్రజా నాయకులు
గౌ॥ శ్రీ మామిడి
గోవిందరావు గారికి మా
హృదయపూర్వక జన్మదిన
శుభాకాంక్షలు తెలియజేస్తూ...
గౌ॥ శ్రీ మామిడి గోవిందరావు గారు
శాసనసభ్యులు, పాతపట్నం
మొర్రి రామక్రిష్ణ
కొరసవాడ

# 15 వరకు ప్రస్తుత విధానమే : ఏఎంసీ

పలాస, జూన్ 30 (వార్త): ఈ నెల 15వరకు ప్రస్తుత విధానమే కొనసాగుతుందని పలాస వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మల్లా శ్రీనివాసరావు మంంళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-పర్మిట్ విధానము విషయమై, ప్రస్తుతము డిజిటల్ విధానము అవకాశము లేని వర్తకులకు ఆన్‌లైన్ పరిధిలోకి తెచ్చేందుకు వారికి సహకరిస్తూ ఈ నెల 15వరకు సదరు వర్తకులకు ఆన్ లైన్, ఆఫ్ లైన్ పద్ధతిలో వారి వ్యాపార లావాదేవీలకు చేసుకొనుటకు మార్కెటింగు శాఖ ఉన్నతాధికారులు గడువు ఇచ్చారని కార్యదర్శి పేర్కొన్నారు. పలాస ఏఎంసీ ఆధ్వర్యంలో జీడి వ్యాపారులతో సమావేశం నిర్వహించగా, సెస్ నోటీసులపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయన్నారు. దీంతో మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు గడువు ఇచ్చారని కార్యదర్శి ఆంద్రయ్య, విజయ్, దుర్యోధన పేర్కొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం కండి

## నియోజవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి



పలాస, జూన్ 30 (వార్త): రానున్న మున్సిపల్ ఎన్నికలకు ప్రతి కార్యకర్త, నాయకులు కలుసుకుట్టుగా పనిచేసి పలాస మున్సిపాలిటీలు టిడిపి జెండా ఎగరవేయాలని పలాస నియోజవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి పిలుపునిచ్చారు. పలాస నియోజకవర్గంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలాస తెలుగుదేశం పార్టీ సమన్వయ కర్త వెంకన్న చౌదరి ఆధ్వర్యంలో రానున్న మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, వార్డు ఇన్‌చార్జీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకన్న చౌదరి మాట్లాడుతూ రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో, క్రమశిక్షణతో, పూర్తి ఏకాభిప్రాయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బూత్ స్థాయి బలోపేతం, ప్రజల సమస్యలపై ప్రత్యక్ష స్పందన, అభివృద్ధి--సంక్షేమ కార్యక్రమాల ప్రచారం ద్వారా ఎన్నికల్లో విజయానికి మార్గం సుగమమవుతుందని పేర్కొన్నారు. పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. నాయకులు ఐకమత్యంతో ముందుకు సాగితే రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

రానున్న మున్సిపల్ ఎన్నికల కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో, క్రమశిక్షణతో, లక్ష్యబద్ధంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడించగా, ఎన్నికల నిర్వహణ, బూత్ స్థాయి కార్యాచరణ, పార్టీ సంస్థాగత బలోపేతంపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో ఏపీ టీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, ఏఎంసీ చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేష్, పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ అధ్యక్ష కార్యదర్శులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, వార్డు ఇన్‌చార్జీలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరుణుడి కరుణ కోసం..

## -పలాస-కాశీబుగ్గ 10వ వార్డులో భక్తి ప్రవాహం - "ఓం నమఃశివాయ" నామస్మరణతో మార్మోగిన కాశీ విశ్వేశ్వరాలయం రైతాంగ సుభిక్షమే సంకల్పం - సకాలంలో వర్షాలు కురవాలని వరుణ యాగం..!

# శివునికి మహా జలాభిషేకం

పలాస, జూన్ 30 (వార్త): ఖరీఫ్ సాగు సాఫీగా సాగాలని... అన్నదాతల పొలాలు పచ్చని పైరులతో కళకళలాడాలని... చెరువులు, కాలువలు జలకళతో నిండిపోవాలని... ప్రకృతి కరుణించి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ పలాస-కాశీబుగ్గ 10వ వార్డు శివాలయం వీధి లోని ప్రసిద్ధ శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన వరుణ యాగం, మహా జలాభిషేకం అపూర్వ ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తగా, శివనామస్మరణలతో ఆలయ ప్రాంగణమంతా భక్తిరసంలో తేలిపోయింది. మాజీ కౌన్సిలర్ శర్వాణ గీతారవి దంపతులు, ఆలయ అభివృద్ధి కమిటీ సంకల్పంతో నిర్వహించిన ఈ మహోత్సవంలో వేదపండితులు శాస్త్రోక్తంగా వరుణ యాగం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, ప్రత్యేక హోమాలు, అర్చనలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య యాగశాల దివ్య కాంతులతో నిండిపోగా, ప్రతి మంత్రధ్వని ప్రకృతి శాంతి, లోకక్షేమం, రైతాంగ శ్రేయస్సు కోసం చేసిన మహా ప్రార్థనగా మారింది. పరిసర గ్రామాలు, పట్టణాల నుంచి వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. తమ ఇళ్లలో పసుపు, కుంకుమ, విభూదితో పవిత్రం చేసిన జలాన్ని బిందెల్లో తీసుకువచ్చి శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామివారికి మహా జలాభిషేకం నిర్వహించారు. శివలింగంపై అభిషేక జలధారలు పారుతుండగా భక్తులు పరవశించి "హర హర మహాదేవ", "ఓం నమఃశివాయ", "శంభో శంకర" అంటూ నినాదాలు చేయడంతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది. అభిషేకాల అనంతరం ప్రత్యేక అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాదాల పంపిణీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా, ఆలయ పరిసరాలు శివభక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రతి ఒక్కరూ పరమేశ్వరుని అనుగ్రహంతో సకాలంలో వర్షాలు కురవాలని, ప్రకృతి సమతుల్యత నెలకొనాలని, పంటలు సమృద్ధిగా పండాలని, రైతుల కష్టానికి తగిన ఫలితం దక్కాలని హృదయపూర్వకంగా ప్రార్థించారు. వర్షాధార వ్యవసాయంపై ఆధారపడిన ఉత్తరాంధ్ర రైతాంగానికి ఈ ఖరీఫ్ సీజన్ అత్యంత కీలకమైన నేపథ్యంలో నిర్వహించిన ఈ వరుణ యాగం విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. పరమేశ్వరుని కృపతో వరుణుడు ప్రసన్నమై భూమాతను పచ్చని పైరులతో అలంకరించాలని, ప్రతి చెరువు నిండాలని, ప్రతి రైతు ఇంట ఆనందం వెల్లివిరియాలని భక్తులు ఏకస్వరంతో వేడుకున్నారు. ఆధ్యాత్మికత, ప్రకృతి పరిరక్షణ, రైతాంగ సంక్షేమం అనే మూడు మహత్తర సంకల్పాలకు ప్రతీకగా నిలిచిన ఈ మహా కార్యక్రమం పలాస-కాశీబుగ్గలో విశేష ఆకర్షణగా నిలిచింది. వేదఘోషలు, యాగాగ్ని జ్వాలలు, అభిషేక జలధారలు, శివనామస్మరణలు, భక్తుల విశ్వాసం కలిసి శ్రీ కాశీ విశ్వేశ్వరాలయాన్ని ఓ దివ్య కైలాసంగా మలిచాయి. శివపార్వతుల అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురిసి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని, అన్నదాతల జీవితాల్లో వెలుగులు నిండాలని ప్రతి భక్తుడి ప్రార్థన పరమేశ్వరుని సన్నిధిలో మార్మోగింది.ం





# ఉద్యోగులకు పదవీ విరమణ సర్వ సాధారణం

## -పలాస ఆర్‌డీవో అప్పలరాజు

## -జూనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పదవీ విరమణ



పలాస, జూన్ 30 (వార్త): ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు, పదవి విరమణ సర్వసాధారణమని పలాస ఆర్ డి ఓ ఆర్ అప్పలరాజు అన్నారు. పలాస తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం పలాస ఆర్డివో కార్యాలయంలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్ పైల వెంకటేశ్వర్లు పదవి విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. పైల వెంకటేశ్వర్లు మీనాక్షి దంపతులకు ఆర్ డి ఓ ఆర్ అప్పలరాజు, రెవెన్యూ అధికారులు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో సీనియర్ ఉద్యోగులు పదవి విరమణ చేపడుతున్నారని, పదవి విరమణ చెందడం ద్వారా రెవిన్యూ శాఖకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. పైల వెంకటేశ్వర్లు 34 ఏళ్ళు ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయన్నారు. చిన్నప్పట్నుంచీ వెంకటేశ్వర్లు వడి దడుగులు ఎదుర్కొంటూ జూనియర్ అసిస్టెంట్ వరకు ఎదిగారని, రెవెన్యూ శాఖకు ఎన్నో సేవలు అందించారని కొనియాడారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంత మంది అధికారులు, తోటి ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది సహాయ సహకారాలు అందించడం ద్వారా 34 ఏళ్ళు విధి నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉద్యోగం చేయగలిగానని చెప్పారు. అంత మందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పైల రామారావు, పైల హేమా చలం, బగాది రాము, బగాది దివ్య కుమారి, చింతాడ బాను ప్రకాష్, చింతాడ జ్యోతిర్మయి, పలాస, కవిటి, మోళియాపుట్టి, సోంపేట మండలాల తహశీల్దార్లు శ్రీదేవి, కళ్యాణ చక్రవర్తి, బి పాపారావు, అప్పలస్వామి, ఆర్ డి ఓ కార్యాలయం ఎఓ ప్రకాష్, డిప్యూటీ తహశీల్దార్లు వాయిలపల్లి గిరి, భాగ్యలక్ష్మి, సునంద, లక్ష్మి నారాయణ, శ్రావణ్, కరుణ, విఆర్వోల సంఘం జిల్లా కార్యదర్శి కొర్ల శ్రావణ్ కుమార్, ఆర్ ఐలు మన్మధరావు ప్రసాదరావు టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ సవర రాంబాబు కొండే నర్సింహులు, దువ్వాడ శ్రీకాంత్, పి విఠల్ రావు, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# సారవకోట తహసీల్దార్ కార్యాలయ నూతన భవన పనుల పరిశీలన

## - గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

## -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

## - నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడొద్దని అధికారులకు ఆదేశాలు



సారవకోట, జూన్ 30 (వార్త): సారవకోట మండల ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు నిర్మిస్తున్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణ పనులను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వినియోగంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం నూతన భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆధునిక వసతులతో నిర్మిస్తున్న ఈ భవనం పూర్తయితే ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిర్మాణ పనులను ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉపయోగించే సామగ్రి నాణ్యత విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. నాణ్యమైన నిర్మాణంతో ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడే విధంగా భవనాన్ని నిర్మించాలని సూచించారు. అలాగే పనుల పురోగతిపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, పీఏసీఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# గిరిజన మత్స్యకారులకు మోపెడ్ల పంపిణీ

## - ఆర్థిక పురోభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

## - 8 మంది లబ్ధిదారులకు ఐస్‌బాక్సులతో కూడిన వాహనాల అందజేత

సారవకోట, జూన్ 30 (వార్త): గిరిజన ప్రాంతాల్లోని మత్స్యకార కుటుంబాల ఆర్థిక పురోభివృద్ధే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. మంగళవారం సారవకోట మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలు గిరిజన గ్రామాలకు చెందిన 8 మంది అర్హులైన మత్స్యకార లబ్ధిదారులకు ద్విచక్ర వాహనాలు (మోపెడ్లు) పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నివసించే మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మత్స్యకారులు వేటాడిన తాజా చేపలను నాణ్యత కోల్పోకుండా మార్కెట్‌కు సురక్షితంగా తరలించేందుకు మోపెడ్ వాహనాలకు అధునాతన ఐస్ బాక్సులను కూడా అందజేసినట్లు తెలిపారు. దీంతో చేపల విక్రయానికి సౌలభ్యం కలగడంతో పాటు మత్స్యకారులకు మెరుగైన ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను రానున్న రోజుల్లో కూడా అమలు చేస్తామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, పీఏసీఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పట్ట ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, సంబంధిత శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



## శ్రీముఖలింగేశ్వర ఆలయ భూములు, మాడవీధుల్లో

# ఆక్రమణలు తొలగించాలి



జలుమూరు, జూన్ 30(వార్త): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వర ఆలయం అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన మాడవీధుల విస్తరణ పనుల లక్ష్యం ప్రస్తుతం ఆక్రమణల కారణంగా దెబ్బతింటోందని మాజీ సర్పంచ్, మాజీ వైస్ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, ఆలయం చుట్టూ 45 అడుగుల మేర మాడవీధుల విస్తరణ కోసం ఇళ్లను తొలగించి, భూసేకరణ చేపట్టి బాధితులకు నష్టపరిహారం చెల్లించారు. 2016 నుంచి 2019 మధ్య అప్పటి ఆర్డీవో వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి, ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం పరిహారం అందజేసిందన్నారు. అనంతరం ప్రస్తుత ప్రభుత్వం కూడా సుమారు రూ.కోటిన్నర నిధులు కేటాయించి సీసీ రోడ్లు నిర్మించడం ద్వారా దేవాలయం చుట్టూ మాడవీధుల అభివృద్ధికి కృషి చేసిందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం 45 అడుగుల పరిధిలో కొందరు ఆక్రమణదారులు ఇష్టానుసారంగా బాత్రూములు, షాపులు నిర్మించడం, బోర్లు వేయడం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఈ విషయాన్ని పలువురు గ్రామస్తులతో కలిసి ఎండోమెంట్ అధికారులకు, ముఖ్యంగా ఈవో దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. పైగా ఆక్రమణదారులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారనే ప్రచారం గ్రామంలో వినిపిస్తోందని అన్నారు. అలాగే శ్రీముఖలింగేశ్వర ఆలయం, రాధాగోవింద మఠం, నరసింహస్వామి దేవాలయాలకు శ్రీముఖలింగం గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో సుమారు 250 ఎకరాల దేవాదాయ భూములు ఉన్నాయని, అదేవిధంగా పాతపట్నం ప్రాంతం, వంశధార నదికి అవతల ఉన్న గ్రామాల్లో మరో 100 నుంచి 150 ఎకరాల వరకు ఆలయ భూములు ఉన్నాయని తెలిపారు. వాటిలో అనేక భూముల వివరాలు కూడా ఎండోమెంట్ శాఖ అధికారుల వద్ద సక్రమంగా లేవని, దీంతో అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని మాజీ వైస్ సర్పంచ్ గుంట కర్ణవీరుడు వాపోయారు. కొంత మంది ఐతే నరసింహ స్వామి అలియానికి వున్నా చెరువులు కప్పి పక్కా బి-రకం ఇళ్ళు కటుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది స్పందించి దేవాదాయ భూముల్లోని ఆక్రమణలను తొలగించి, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పాత్రికేయుల ద్వారా విజ్ఞప్తి చేశారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతులు

**- ఏరువాక పున్నమి అనంతరం దుక్కులు ప్రారంభం**

**-మండలానికి 826 క్వింటాళ్ల వరి విత్తనాలు**

**- ఏవో రవికుమార్**



**జలుమూరు, జూన్ 30(వార్త):** ఏరువాక పున్నమి ప్రారంభమైన నేపథ్యంలో జలుమూరు మండల రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు పొలాలను దున్నుతూ దుక్కులు చేపట్టి సాగు పనులను ప్రారంభించారు. అనుకూల వర్షాలు కురుస్తాయనే ఆశతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మండలంలో గత ఖరీఫ్ సీజన్‌లో 22,132 ఎకరాల్లో వరి సాగు జరిగినట్లు వ్యవసాయ అధికారి (ఏవో) రవికుమార్ తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు అవసరాల దృష్ట్యా వివిధ రకాల వరి విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మొత్తం 826 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతు సేవా కేంద్రాలకు (ఆర్ఎస్‌కేలు) చేరాయని, ఇప్పటికే రైతులకు విత్తనాల పంపిణీ ప్రారంభించి అవసరమైన మేర సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉంటుందని రైతులకు సూచించారు. సాగు అవసరాలకు అనుగుణంగా యూరియా ఎరువులు కూడా తగినంత నిల్వలో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏవో రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తూ సాగు చేపట్టాలని, వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్న సలహాలను పాటించాలని రైతులకు వ్యవసాయ శాఖ సూచించింది. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

## జ్యోత్స్నకు 'షైనింగ్ స్టార్' అవార్డు

**- మంత్రి లోకేశ్ నుంచి పురస్కారం స్వీకరణ**

**- సీఈసీలో 967 మార్కులతో రాష్ట్రంలో తొలి స్థానం**



**జలుమూరు, జూన్ 30(వార్త):** కరవంజ మోడల్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని దుంగ జ్యోత్స్న ఇంటర్మీడియట్ సీఈసీ విభాగంలో 967 మార్కులు సాధించి రాష్ట్ర ప్రథమ స్థానంలో నిలవడంతో ఆమెకు ప్రతిష్ఠాత్మక 'షైనింగ్ స్టార్' అవార్డు లభించింది. సోమవారం రాత్రి తాడేపల్లిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా జ్యోత్స్న ఈ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా మంత్రి ఆమెను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థిని తల్లిదండ్రులను కూడా మంత్రి అభినందిస్తూ, వారి ప్రోత్సాహం, కృషి విద్యార్థిని విజయానికి దోహదపడిందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు, కళాశాలకు గుర్తింపు తీసుకురావడం పట్ల ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు జ్యోత్స్నకు అభినందనలు తెలిపారు. ఆమె సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న పూజిత

**- పదో తరగతిలో 589 మార్కులతో ప్రతిభ చాటిన విద్యార్థిని**



**నరసన్నపేట, జూన్ 30(వార్త):** నరసన్నపేట మండలం కొత్త పోలవలస గ్రామానికి చెందిన శిమ్మ పూజిత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికై మండలానికి గర్వకారణంగా నిలిచింది. పదో తరగతి పరీక్షల్లో 589 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన ఆమె ఈ అవార్డుకు ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వమరవెల్లి బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన పూజిత విద్యలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. సోమవారం రాత్రి తాడేపల్లిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి లోకేశ్ నుంచి శిమ్మ పూజిత అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా ఆమెను మంత్రి అభినందించి, భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అవార్డు అందుకోవడం పట్ల పూజిత ఆనందం వ్యక్తం చేస్తూ, తన విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహమే కారణమని పేర్కొంది. ఆమె తల్లిదండ్రులు బాలరాజు, యశోద తమ కుమార్తె సాధించిన విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, మరింత ఉన్నత విద్యను అభ్యసించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. గ్రామస్థులు, ఉపాధ్యాయులు, పలువురు ప్రజాప్రతినిధులు పూజితను అభినందిస్తూ, ఆమె విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## బిందెడు నీళ్ల కోసం వజ్రంపేట వాసుల అవస్థలు

**- ఆరు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు**

**- అధికారులకు ఫిర్యాదు చేసినా పరిష్కారం లేదని ఆవేదన**



**నరసన్నపేట, జూన్ 30 (వార్త):** వజ్రంపేటలో గత ఆరు నెలలుగా తీవ్ర తాగునీటి సమస్య నెలకొనడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బిందెడు తాగునీటి కోసం రోజూ పడిగాపులు పడాల్సి వస్తోందని, తమ సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదని మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని పంచాయతీ కొళాయిల ద్వారా సరిపడా నీరు రావడం లేదని, ఇంటి కుళాయిలకు కూడా నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయిందని స్థానికులు తెలిపారు. దీంతో తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. తాగునీటి సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటి వరకు ఎలాంటి శాశ్వత పరిష్కారం లభించలేదని స్థానికులు ఆరోపించారు. వేసవి కాలంలో నీటి కొరత మరింత తీవ్రమవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సమస్యను అత్యవసరంగా పరిగణించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలని గ్రామస్థులు అధికారులను కోరుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి

**- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**- మడపాం పాఠశాలను సందర్శించిన ఎంఈఓ ఉప్పాడ శాంతారావు**



**నరసన్నపేట, జూన్ 30 (వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించి వాటిని మరింత ప్రోత్సహించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) ఉప్పాడ శాంతారావు సూచించారు. మంగళవారం నరసన్నపేట మండలం మడపాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థుల అభ్యాస సామర్థ్యం, ప్రతిభ, నైపుణ్యాలను పరిశీలిస్తూ వారితో మాట్లాడారు. ప్రతి విద్యార్థిలోని ప్రత్యేక ప్రతిభను గుర్తించి, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా విధానాలు, బోధనా ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించాలని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, అభ్యాస నైపుణ్యాలు పెంపొందేలా తరగతి బోధన ఉండాలని తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రతి విద్యార్థి విద్యా పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ అవసరమైన సూచనలు అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల నిర్వహణ, బోధన విధానాలపై కూడా ఎంఈఓ సమీక్ష నిర్వహించి, విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

## అభివృద్ధి కార్యక్రమాలతో...

# ప్రజల్లోకి వెళ్లండి




**పలాస, జూన్ 30 (వార్త):** పలాస నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి కుటుంబానికి తీసుకెళ్లాలని పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త వై.వి.చౌదరి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల, మున్సిపల్ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్, యూనిట్ కన్వీనర్లు, కో-కన్వీనర్లకు పిలుపునిచ్చారు. మంగళవారం టిడిపి పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొంటూ, గత 25 నెలల్లో పలాస నియోజకవర్గంలో రూ.984 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం చారిత్రాత్మక విజయమని అన్నారు. ఈ అభివృద్ధి ఫలితాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయని, ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా కృషి కొనసాగుతోందని తెలిపారు. మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాలు, పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీలలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వెంకన్న చౌదరి పేర్కొన్నారు. రహదారులు, తాగునీటి పథకాలు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. పార్టీ బలోపేతానికి, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత సమర్థంగా చేరవేయడానికి ప్రతి నెల క్లస్టర్ వారీగా సమావేశాలు నిర్వహించి, విజయమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని నాయకులకు సూచించారు. ప్రతి నాయకుడు ప్రజలతో నిరంతరం మమేకమై ప్రభుత్వ పనితీరును వివరించాలని కోరారు. రాష్ట్రంలో పలాస నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి ఇతర ప్రాంతాలకు మార్గదర్శకంగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకత, వేగం అనే మూడు అంశాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. హరిపురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో స్టేడియం నిర్మాణం, రహదారి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, మందస పట్టణాన్ని విద్యా, నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు "సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటు లక్ష్యంగా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలకు శతశాతం సంతృప్తి కలిగేలా పనిచేయగలిగామని వెంకన్న చౌదరి పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు. అదేవిధంగా పార్టీ నాయకులు సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నిర్వహించే కార్యక్రమాల్లో ప్రాధాన్యత క్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలని, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ప్రాధాన్యతను ప్రజలకు స్పష్టంగా వివరించి వాటి అమలును మరింత వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్త ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అభివృద్ధి--సంక్షేమమే తెలుగుదేశం పార్టీ లక్ష్యమనే సందేశాన్ని విస్తృతంగా చాటి చెప్పాలని వెంకన్న చౌదరి పిలుపునిచ్చారు.


## బీసీ హాస్టల్ విద్యార్థుల ఆత్మీయ కలయిక



**ఇచ్ఛాపురం, జూన్ 30 (వార్త):** స్థానిక బీసీ బాయ్స్ హాస్టల్‌లో చదువుకున్న 2009--2010 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. చాలా సంవత్సరాల తర్వాత ఒకే చోట కలుసుకోవడం అందరికీ ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఈ సందర్భంగా హాస్టల్‌లో ప్రస్తుతం ఉన్న సుమారు 30 మంది విద్యార్థులకు అన్నదానంనిర్వహించారు. దుస్తులు, ఆట వస్తువులను అందజేశారు. అదేవిధంగా విద్యార్థుల భవిష్యత్తు అభివృద్ధికి ఉపయోగపడేలా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అప్పటి ట్యూటర్ లు ఉపాధ్యాయులైన జయలక్ష్మి , గోవింద్ పాఢీ,హేమంత్ లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వారు విద్యార్థులతో తమ అనుభవాలను, విలువైన సూచనలను పంచుకోవడంతో అందరూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన హాస్టల్ వార్డెన్ కి, హాస్టల్ సిబ్బందికి పూర్వ విద్యార్థులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ 2009--2010 బ్యాచ్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## మంత్రి లోకేష్‌తో సాగర్ భేటీ

**కొత్తూరు, జూన్ 30(వార్త):** విశాఖపట్నంలో నిర్వహించిన కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ను పాతపట్నం నియోజకవర్గ యువనాయకుడు కలమట సాగర బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్రపతి ద్రౌపతి మూర్ము పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కలమట సాగర్, మంత్రి లోకేష్‌తో పాతపట్నం నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, స్థానిక ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు మరియు పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలమట సాగర్, మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా హాజరయ్యారు.



## గణిత గురువుకు ఘన వీడ్కోలు

**కొత్తూరు, జూన్ 30(వార్త):** మాతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విశిష్ట సేవలందించిన పిన్నింటి కృష్ణారావు మాస్టర్ పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాతపట్నం మాజీ శాసనసభ్యులు కలమట వెంకటరమణ మూర్తి సతీసమేతంగా హాజరై కృష్ణారావు మాస్టర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలమట మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి అత్యంత పవిత్రమైనదని, కృష్ణారావు మాస్టర్ తన సుదీర్ఘ సేవా కాలంలో వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి జీవితాలకు బలమైన పునాది వేశారని కొనియాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, కృష్ణారావు మాస్టర్ కుటుంబ సభ్యులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పలువురు వక్తలు ఆయన విద్యా సేవలను స్మరించుకుంటూ, పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా కొనసాగాలని ఆకాంక్షించారు.




# ఉద్యమాల ద్వారానే హక్కుల సాధన

✻ ఏపీజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జోగి నాయుడు, జిల్లా అధ్యక్షులు షణ్ముఖరావు ✻ శ్రీకాకుళంలో 8న ఏపీజేఎఫ్ మహాసభ-జర్నలిజం సవాళ్లు అనే అంశంపై చర్చ ✻ ఏపీజేఎఫ్ గోడ పత్రిక ఆవిష్కరణ




**శ్రీకాకుళం, జూన్30 (వార్త):** ఐక్య ఉద్యమాల ద్వారానే హక్కులను సాధించుకోవచ్చునని ఏపీ జేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ జోగి నాయుడు, జిల్లా అధ్యక్షులు జి షణ్ముఖరావులు పేర్కొన్నారు. ఇందుకు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టు ఫోరం సరైన వేదిక అని చెప్పారు. జిల్లాలో ఉన్న జర్నలిస్టులంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నేత కొంక్యాన వేణుగోపాల్ రావు, ఐ ఎఫ్ డబ్ల్యూ జె రాష్ట్ర నేతలు ఎన్ ఈశ్వరరావు, ఎంవీ మల్లేశ్వరరావు మాట్లాడుతూ శ్రీకాకుళం ఐక్యతకు చిహ్నమని, సోదరభావంతో ఏపీజేఎఫ్ మహాసభను విజయవంతం చేస్తామని చెప్పారు. సామాజికవేత్త గేదెల ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ జర్న లిస్టులంతా ఉద్యమకారులని పేర్కొన్నారు. ఏపీజేఎఫ్ మహాసభకు తన వంతు సహాయం అందిస్తానన్నారు. జూలై 8న మహాసభ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరం శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో 'మహాసభ' నిర్వహించనున్నామని తెలిపారు. శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందన్నారు. ఈ మహాసభలో ముఖ్యంగా 'జర్నలిజం సవాళ్లు' అనే అంశంపై ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని చెప్పారు. ప్రస్తుత కాలంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, వృత్తిపరమైన సవాళ్లపై ఈ సభలో సుదీర్ఘంగా చర్చిస్తామన్నారు. నిజమైన జర్నలిస్టులకు ఇదొక నిఖార్సైన వేదికగా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు. జర్నలిస్టులందరూ కలిసికట్టుగా కదలివచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమాజ శ్రేయస్సు కోసం, వృత్తి ధర్మాన్ని కాపాడుకుంటూ నిజాయితీతో పనిచేసే జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని చాటేలా ఈ సభ సాగుతుందని, జర్నలిస్టు కుటుంబ సభ్యులందరూ ఇందులో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ సంఘాలు ప్రతినిధులు డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, చింతపల్లి నాగభూషణరావు, శ్రద్ధానంద పట్నాయక్ (కలియ), బొడ్డేపల్లి ప్రసాదరావు, రౌతు సూర్యనారాయణ, గుజ్జల సూర్యనారాయణ, సీపాన రమేష్ కుమార్, టెంక శ్రీను, ఆర్ బాలకృష్ణ, వి ధనుంజయ, ఈశ్వర్, ఆనంద్, కొండ బాబు, శంకర్, గొండు సాయి, మణి, ఆకుల కృష్ణ, పుష్ప, రహీమ్, బాలు, పృధ్వి, రామకృష్ణ, శ్యామ్, బమ్మిడి వేణు, తదితరులు పాల్గొన్నారు.





## శ్రీకాకుళం

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం

- ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ పాలక్ వర్మ సమీక్ష
- 2029 లక్ష్యంగా గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలని పిలుపు



**శ్రీకాకుళం, జూన్ 30(వార్త):** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసి ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ పాలక్ వర్మ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీ ఆధ్వర్యంలో, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏ--2 ప్రక్రియ, క్షేత్రస్థాయి పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, పార్టీ విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తల కృషి, బలమైన సంస్థాగత నిర్మాణమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో కూడా జిల్లా, నియోజకవర్గం, మండలం, గ్రామం, వార్డు స్థాయి వరకు ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధి కోసం సమిష్టిగా పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాడుతూ కాంగ్రెస్ పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయాలని, 2029 ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకుని పార్టీ బలోపేతానికి ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ, జలుమూరు మండల కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త గుంట కర్ణవీరుడు తదితరులు సమావేశంలో పాల్గొని, గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ 2029లో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.



# పచ్చిక మైదానాన్ని తలపిస్తున్న వంశధార కాలువ

- ఖరీఫ్ సీజన్‌కు ముందే పూడిక, పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టాలని రైతుల డిమాండ్
- సాగునీటి విడుదలకు ముందే కాలువలను సిద్ధం చేయాలని విజ్ఞప్తి



**నరసన్నపేట, జూన్ 30(వార్త):** దేశవానిపేట సమీపంలో పోలాకి రహదారిపై ఉన్న కిల్లాం ఛానల్ పరిధిలోని వంశధార కాలువ పిచ్చిమొక్కలు, గడ్డితో పూర్తిగా కప్పుకుపోయి పచ్చిక మైదానాన్ని తలపిస్తున్న దృశ్యం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న సమయంలో కాలువల దుస్థితి భవిష్యత్ సాగునీటి సరఫరాపై సందేహాలు రేకెత్తిస్తోంది. మరో 15 రోజుల్లో ఖరీఫ్ సాగు కోసం వంశధార కాలువల ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం ఉందని భావిస్తున్న నేపథ్యంలో, కాలువలో పిచ్చిమొక్కలు, పూడిక అధికంగా పేరుకుపోవడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీరు విడుదల చేసే ముందు కాలువల్లో పూడిక తొలగింపు, పిచ్చిమొక్కల నిర్మూలన, ఆక్రమణల తొలగింపు వంటి పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు సంబంధిత అధికారులు స్పందించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కాలువలో నీరు సక్రమంగా ప్రవహించడం కష్టమేనని వారు పేర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే కాలువలను పూర్తిస్థాయిలో శుభ్రపరిచి నీటి ప్రవాహానికి అనువుగా మార్చాలని, లేకపోతే సాగునీటి సరఫరా దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి జీవనాడిగా ఉన్న వంశధార కాలువల నిర్వహణపై సంబంధిత అధికారులు వెంటనే దృష్టి సారించి అత్యవసర చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# వైద్యో..నారాయణో హరి..!

- వైద్యులే ప్రజారోగ్యానికి పెద్దదిక్కు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

(సోంపేట)

'ఆరోగ్యమే మహాభాగ్యం 'అన్నది పూర్వీకుల నుంచి వస్తున్న మాట. ఎన్ని ఆస్తిపాస్తులు ఉన్నా,ఎంత ఆదాయం ఉన్నా మనిషికి ఆరోగ్యం సరిలేనిదే ఆయన జీవన విధానం గతి తప్పుతోంది. ఏమీ లేకున్నా ఆరోగ్యం మాత్రం బాగుంటే అన్ని పనులు చక్కదిద్దుకునే సామర్థ్యం ఉంటుంది. జీవన ప్రయాణం సాఫీగా సాగుతోంది. అందుకే ప్రతి ఒక్కరూ అన్నిటికన్నా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆరోగ్యం కోసం ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ రకరకాల వ్యాధులు మనిషిని చుట్టుముడుతున్నాయి. సాధారణ వ్యాధులతో పాటు కొత్తగా వస్తున్న వ్యాధులతో సమాజం ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో అనారోగ్యంతో ఉన్న వ్యక్తిని సమయానికి ఆదుకునే ప్రత్యక్ష దైవంలా వైద్యుడు పోషిస్తున్న పాత్ర అంతా కాదు. పురాతన కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు సమాజంలో వైద్యుడి పాత్ర అనిర్వచనీయమని చెప్పవచ్చు. అందుకే ప్రజల ఆరోగ్యాన్ని కుదుటపరిచి మళ్లీ మామూలు వ్యక్తులుగా తీర్చిదిద్దే గొప్ప సత్తా ఉన్న వ్యక్తులుగా డాక్టర్లను పేర్కొనవచ్చు. అటువంటి మహానుభావులను స్మరించుకునేందుకు, ప్రత్యేకంగా గుర్తించేందుకు ప్రతి ఏటా జులై 1న జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహిస్తున్నారు.

ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, ప్రముఖ వైద్యుడు, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ వైద్య వృత్తిలో కొనసాగుతూ మరోవైపు ముఖ్యమంత్రిగా వైద్య రంగానికి ఎనలేని ప్రాధాన్యం ఇచ్చి ఆ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఆయన శాయశక్తులా కృషి చేశారు. అందరికీ ఉచిత వైద్యం అందాలని బలంగా ఆకాంక్షించి ఆచరణలో పెట్టారు. వైద్య రంగాన్ని అభివృద్ధి చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలను ఏర్పాటు చేయడంలో డాక్టర్ బిధాన్ చంద్ర రాయ్ కీలకపాత్ర పోషించారు. ఆయన సేవలకు గుర్తింపుగా 1961లో భారతరత్న పురస్కారం కూడా అందజేశారు. సేవా దృక్పథంతో కూడిన వైద్యాన్ని ఉపయోగించి రోగుల ఆరోగ్య స్థితిని మెరుగుపరిచే ప్రయత్నంలో నిరంతరం శ్రమిస్తున్న వైద్యులను గుర్తించాలన్న ఆలోచనతో ప్రతి ఏటా జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. డాక్టర్ బిదాన్ చంద్ర జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని, ఆయన జన్మదినమైన జులై 1ని డాక్టర్స్ డే గా నిర్ణయించి భారత ప్రభుత్వం 1991 నుంచి దీన్ని అధికారికంగా అమలు చేస్తోంది.






## సోంపేట ఐఎంఏ ఆధ్వర్యంలో...

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సోంపేట శాఖ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సోంపేటలో గల ఒక ప్రైవేట్ కళ్యాణ మండపంలో డాక్టర్స్ డే నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఏవీ రామకృష్ణ తెలిపారు. సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం, హరిపురం, పలాస ప్రాంతాల నుంచి వైద్యులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ ఎస్.రాజేంద్రప్రసాద్‌ను సన్మానం చేయనున్నారు. వైద్యుల అభిప్రాయాలు, చర్చాగోష్ఠి మొదలైన కార్యక్రమాలతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546